క్లుప్తంగా

3 అర్బన్ పీహెచ్‌సీల ప్రారంభం నేడు

రాయచోటి అర్బన్ : మునిసిపల్ పరిధిలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లను సోమవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాంబాబు తెలిపారు. పేదల సంక్షేమం – ఆరోగ్యంలో భాగంగా పట్టణంలో రూ. 4 కోట్ల నిధులతో అధునాతన హంగులతో మూడు ప్రాంతాల్లో వైఎస్ఆర్ అర్బన్ ఈ హెల్త్ సెంటర్‌లను నిర్మించామన్నారు. ఉదయం 10 గంటలకు బండ్లపెంట, 11గంటలకు కె.రామాపురం, 12 గంటలకు తిరుపతి నాయుడు కాలనీలోని అర్బన్ పీహెచ్‌సీల ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్‌ల చేతుల మీదుగా ప్రారంభ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం


జెండాను ఊరేగిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఆలీనగర్‌లోని హజరత్ ఖాదర్‌వలీ దర్గా ఉరుసు మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా నుంచి జెండాను గ్రామంలో మేళతాళాలతో ఊరేగింపు చేశారు. అనంతరం జెండాను దర్గా వద్దకు చేర్చి అక్కడ స్వామి వారికి చదివింపులు చదివించి వచ్చిన భక్తులకు, ప్రజలకు దర్గా కమిటీ వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు షేక్ అల్లాద్దీన్, డాక్టర్ పఠాన్‌షాహీద్‌ఖాన్, షేక్ మస్తాన్, పఠాన్ అఫ్తాబ్ ఖాన్, షేక్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

షేక్ అబ్దుల్లాకు ఎంజేఎఫ్ అవార్డు


ఎంజేఎఫ్ అవార్డు అందుకుంటున్న రీజియన్ చైర్మన్ షేక్ అబ్దుల్లా

రాజంపేట రూరల్ : లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ షేక్ అబ్దుల్లా ఎంజేఎఫ్ అవార్డు అందుకోవడం గర్వకారణమని రాజంపేట లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వై.సుబ్రమణ్యం రాజు అన్నారు. గుత్తిలో జరిగిన మూడో క్యాబినెట్ సమావేశంలో ఆదివారం లయన్స్ గవర్నర్ చంద్రప్రకాష్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు సుబ్రమణ్యంరాజు తెలిపారు. అబ్దుల్లా సేవా కార్యక్రమాలలో ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. రాజంపేట లయన్స్ క్లబ్ తరఫున అబ్దుల్లాకు శుభాకాంక్షలు తెలియజేశారు.

టెన్త్ ఫీజు చెల్లింపునకు 26 వరకు గడువు

పెద్దతిప్పసముద్రం: పదవ తరగతి విద్యార్థులు ఈ నెల 23 నుంచి 26 వరకు అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ఎంఈఓ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు దాటితే అపరాధ రుసుంతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లె: అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మురళికిషోర్ తెలిపారు. అక్రమ సారా విక్రయాలపై అందిన సమాచారం మేరకు పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలోని నారాయణమ్మ(40) ఇంటిలో ఆదివారం సోదాలు నిర్వహించగా సారా లభించినట్లు తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శిల్పారామంలో కళాకారుల సందడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు.

బధిరులకు ఆటల పోటీలు

కడప ఎడ్యుకేషన్ : కడపలోని మున్సిపల్ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయిలో బధిర మహిళలకు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గులు, ఆటల పోటీలను నిర్వహించారు. బధిర మహిళలు ఎందులోనూ తీసిపోరు అన్నట్లుగా అందరూ ఉత్సాహంగా అన్ని పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎఫ్‌డీ డబ్ల్యు మహిళా రాష్ట్రస్థాయి ప్రెసిడెంట్ ధరణి కుమారి, జెలోర్మి కిషోర్, కడప ప్రెసిడెంట్ శ్రీవాణి, వైస్ ప్రెసిడెంట్ శ్రీవిద్య, సుధారాణి పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని దీవించండి

- సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శం
- గుండ్లచెరువు గడప గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


గాలివీడు: సంక్షేమ వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలు రాష్ట్ర ప్రభుత్వానికి నీరాజనాలు పలుకుతున్నారని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుండ్లచెరువు సచివాలయ పరిధిలోని గుండ్లచెరువు కస్బా, రామిరెడ్డిగారిపల్లె, దుగ్గనవాండ్లపల్లె, కడియాండ్లవాండ్లపల్లె, మోపూరివాండ్లపల్లెలలో పర్యటించి ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజా సమస్యలను తెలుసుకొని సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమాన్ని అందిస్తున్న తమ ప్రభుత్వాన్ని మనసారా దీవించాలని గ్రామస్తులను కోరారు. సచివాలయం, ఆర్బీకే, వలంటీర్ వ్యవస్థలు దేశానికి ఆదర్శమని చెప్పారు. దేశం మొత్తం ఆంధ్రరాష్ట్రం వైపు చూస్తుందంటే తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధే కారణమన్నారు. అనంతరం ఆయన గ్రామంలోని సమస్యలపై ఆరాతీసి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి గుండ్ల చెరువు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలుకుతూ ఆత్మీయ స్వాగతాలు మధ్య కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదభూషన్ రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్ మొహిద్దీన్, సర్పంచ్‌లు ఉమాపతి రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, ఉమా ప్రభాకర్, సి.రామాంజుల రెడ్డి, హనుమాన్ నాయక్, ఎంపీటీసీలు చంద్రప్రకాష్ రెడ్డి, చిన్నరెడ్డి, అమానుల్లా, వాటర్ షెడ్ చైర్మన్ బండి బసిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మా అమర్నాథరెడ్డి, భానుమూర్తి రెడ్డి, ఎస్. వేణుగోపాల్, బి.దామోదర్‌రెడ్డి, బి.భాస్కర్ రెడ్డి, పి.గోపాల్, నడిపి రెడ్డన్న, మాజీ సర్పంచ్ ఐ.రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


రామాపురం: వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి మందులు అందిస్తున్న ఎమ్మెల్యే గడికోట

రామాపురం : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కుమ్మరపల్లె గ్రామపంచాయతీ కేంద్రంలో మాజీ సర్పంచ్ సదిపిరాళ్ల రామ్‌బసిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులు బసిరెడ్డిని అభినందించారు. జనతా ఆసుపత్రి వైద్యులు మడితాటి నాగిరెడ్డి బృందం రోగులకు వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు.

ఆలయంలో వాస్తు పూజ


మారమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

చిట్వేలి : మండల కేంద్రంలోని మారమ్మతల్లి నూతన ఆలయంలో ఆదివారం వాస్తుపూజను ఘనంగా నిర్వహించారు. చౌడవరం రఘురామిరెడ్డి కుమారుల ఆధ్వర్యంలో నూతన గోపురానికి గణపతిపూజ, చండీహోమం, శాంతి పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేశారు. భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చౌడవరం భాస్కర్ రెడ్డి, సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, పల్లె సురేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి మద్యం విక్రయించాలి

పీలేరు : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిబంధనలకు లోబడి మద్యం విక్రయాలు జరపాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా మద్యం డిపో ఎస్ఐ రామకృష్ణ శాస్త్రి అన్నారు.

వేగంగా బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు


బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు

పీలేరు : మదనపల్లె – తిరుపతి ఫోర్‌లేన్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పీలేరు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎన్‌హెచ్ 71 జాతీయ రహదారి మదనపల్లె – తిరుపతి మధ్య ఫోర్‌లేన్ విస్తరణ పనులకు రూ. 1852 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. తొలివిడతలో మదనపల్లె – పీలేరు మార్గంలో 55.9 కిలోమీటర్ల రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ముందుగా పీలేరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి కడప మార్గం నుంచి తిరుపతి రోడ్డు మార్గం బండకిందపల్లె వరకు బైపాస్ నిర్మాణ పనులు వేగవంతం చేశారు. యుద్ధ ప్రాతిపదికన మట్టితోలకం, చదును చేయడం పనులు చేపట్టారు. బైపాస్ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతుండడంతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె – తిరుపతి మార్గంలో వెళ్లాలంటే పీలేరు పట్టణంలో ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంది. దీంతో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి పీలేరు బైపాస్ తోపాటు పట్టణంలో రెండు ఆర్‌వోబీలు మంజూరు చేయించారు.

బీజేపీ పటిష్టతపై ప్రత్యేక శ్రద్ధ

కురబలకోట : రాష్ట్రంలో బీజేపీ పటిష్టతకు కేంద్ర నాయకత్వం పటిష్ట చర్యలు చేపడుతోందని ఆపార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్‌చార్జి సాయి లోకేష్ పేర్కొన్నారు. అంగళ్లులో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రైల్వేలైన్ ఇతర సమస్యలపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి శ్రద్ధ వహిస్తానన్నారు. ధర్మవరం–పాకాల రైల్వే మార్గం డబుల్ లైన్, కురబలకోటలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేందుకు చొరవ చూపుతానన్నారు. అలాగే చిరకాల కోరిక కడప– బెంగళూరు రైల్వే లైన్ పెండ్లిమర్రి దాకా వచ్చిందన్నారు. వివిధ కారణాల వల్ల ప్లాన్ మారిందన్నారు. దీని పూర్తికి కూడా రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. బెంగళూరుకు అనుసంధానంగా ఐటీ ఆధారిత పరిశ్రమ స్థాపనకు కూడా కేంద్రం దృష్టికి తీసుకెళతానన్నారు. దీని వల్ల ఈ ప్రాంతంలో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు: అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక ఆదివారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని దేవులచెరువుకు చెందిన మల్‌రెడ్డి(50) తన ఇంట్లో మద్యం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించి అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడి నుంచి 13 కర్ణాటక టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

గర్నిమిట్ట యల్లమ్మతల్లికి పూజలు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి బోణాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మంగళవాయిద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి బోణాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నేటి నుంచి అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

మదనపల్లె సిటీ: స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి 25వ తేదీ వరకు 66వ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అండర్–17 బాల,బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎం.వసంత తెలిపారు. ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అలాగే డీఈఓ రాఘవ రెడ్డితో పాటు పీడీలు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఆహ్లాద భరితంగా ఆత్మీయ కలయిక


గురువులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

నందలూరు(రాజంపేట) : జిల్లాలో ఐఏఎస్ పాఠశాలగా ప్రసిద్ధి చెందిన నందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం స్నేహం గొప్పతనాన్ని చాటేలా పూర్వ విద్యార్థుల ఆత్మీయ భేటిని నిర్వహించారు. 1986–87 పదవ తరగతి బ్యాచ్‌లకు చెందిన వారు కుటుంబసభ్యులతో సమావేశానికి హాజరయ్యారు. తమకు పాఠాలు చెప్పిన గురువులు సాంబయ్య, వెంకటసుబ్బయ్య, పుల్లయ్య, రామసుబ్బన్న, చెంచునాగయ్య, కుళాయిరెడ్డి, జె.సుబ్బరాయుడు, జయరామరాజులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలకు రూ.2 లక్షలు విలువైన 60 డెస్క్‌లను పాఠశాలకు వితరణ చేశారు. ఆహ్లాద భరితంగా సాగిన కార్యక్రమం భావోద్వేగాల నడుమ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈయూ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ జీవీ.నరసయ్య, శ్రీరాం ప్రజావైద్యశాల అధినేత డా.రాంబాబు, సీనియర్ జర్నలిస్టు దార్ల శ్రీనివాసాచారి, నాగముని తదితరులున్నారు.

సీనియర్ అసిస్టెంట్ కుటుంబానికి పరామర్శ


మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె మండల ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ గుండెపోటుతో మృతిచెందిన వడ్డి మనోజ్‌కుమార్ మృతి బాధాకరమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఎస్కోలు ప్రార్థన మందిరంలో మనోజ్‌కుమార్ మృతదేహం వద్ద ఘన నివాలర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనంటే ప్రాణమిచ్చే బంధువని, ఈ రోజు మనోజ్ ప్రాణాలతో లేడన్న నిజం మనసును కలిచివేసిందన్నారు. తన బాల్య మిత్రుడిని కోల్పోవడం జీర్ణించుకోలేని విషయమని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, తోట శివసాయి, హరిక్రిష్ణారెడ్డి, సీహెచ్.రమేష్, తుమ్మల సురేష్, మత్తయ్య, గోపి, దార్ల చంద్రశేఖర్, రాజారెడ్డి, రమణారెడ్డి, యజ్జం చంద్రశేఖర్, బత్తిన గంగయ్య, మారే వెంకటయ్య, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నూతన రచయితలకు గ్రంథ అధ్యయనం తప్పనిసరి


కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న రచయితలు

మదనపల్లె సిటీ: సాహితీ రంగంలోకి నూతనంగా ప్రవేశించే వారికి గ్రంథ అధ్యయనం దీపదారి వంటిదని, కలానికి బలాన్ని ఇవ్వగల అమృతం వంటిదని ప్రముఖ నవలా రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో యువ రచయిత మంజు ప్రీతం రచించిన 'తనేగా ప్రాణం' వచనా కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ రచనలపై పుస్తక రచయిత ఆసక్తి పెంచుకోవడం అభినందనీయమన్నారు. ఇలాంటి యువ రచయితలు రచనలు చేయడానికి ముందుకు రావాలన్నారు. గ్రంథ రచయిత తొలి ప్రయత్నంలోనే మంచి కవితా సంపుటిని అందించడం ముదావహం అన్నారు. ఇటీవలి కాలంలో ఆశాజనకంగా నూతన రచయితలు ముందుకొస్తున్నారని తెలిపారు. నిజజీవితంలో యదార్థ ఘటనలు ఆధారంగా రాయడం గొప్ప విషయమన్నారు. కథా రచయిత,విమర్శకులు వేంపల్లి సికిందర్ మాట్లాడుతూ గ్రంథ సమీక్షకావిస్తూ గ్రంథంలోని చమత్కారాలను, ప్రేమాభివేశాన్ని వివరించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ అందరి బాధ్యత


రాజంపేట రూరల్: ఆవిష్కరణలో పాల్గొన్న కార్మిక సంఘం నాయకులు


రాయచోటి అర్బన్: గోడపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నేతలు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ అందరి బాధ్యత అని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివలు తెలిపారు. ఆదివారం మునిసిపల్ కార్యాలయం ఆవరణలో పారిశుధ్య కార్మికులతో కలసి ముద్రించిన గోడపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27న విశాఖలో జరిగే కార్మిక మహా గర్జనలో కేంద్ర ప్రైవేటీకరణ విధానాన్ని ఎండగడతామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు సుధీర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా నేత వంగిమళ్ళ రంగారెడ్డి, ఏఐటీయూసీ నేతలు వెంకటరమణ, శేఖర్, శ్రీనివాసులు, బత్తల రమణ తదితరులు పాల్గొన్నారు.


రాజంపేటలో..

రాజంపేట రూరల్ : విశాఖ ఉక్కు పరిశ్రమను కారుచౌకగా అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 24వ తేదీన రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఈ.సికిందర్‌లు తెలియజేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ఆదివారం ఈ దీక్షలకు సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులతో కలిసి వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 23, 24వ తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా డివిజన్ కార్యాలయాల ముందు, 25వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఆవిష్కరణలో భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కాటంశెట్టి వెంకటయ్య, ఏఐటీయూసీ నాయకులు, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు, జీప్ యూనియన్ నాయకులు, హమాల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తెలుగుభాషకు గిడుగు సేవలు ప్రశంసనీయం

మదనపల్లె సిటీ: తెలుగుభాషకు గిడుగు రామ్మూర్తి సేవలు ప్రశంసనీయమని ప్రముఖ రచయిత వీఎం.నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని మరసం కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి వర్ధంతి పురస్కరించుకుని నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ అగ్రవర్గాలకే పరిమితమైన చదువును బడుగు బలహీన వర్గాలను దగ్గర చేశారన్నారు. భాష ద్వారా సామాజిక అంతరాలను తగ్గించి, తెలుగు నేలను అభ్యుదయం వైపు నడిపించారన్నారు. కార్యక్రమంలో మరసం కార్యదర్శి లింగాల యుగంధరాచారి, కరుణాకర్, శ్రీధర్, కిజర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం, పల్లకీ ఉత్సవం


ధ్వజారోహణ కార్యక్రమంలో అర్చకులు


తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం అర్చకులు క్రిష్ణప్రసాద్ బటార్, రాఘవేంద్రస్వామి, రమేషబాబులు సంప్రదాయ బద్ధంగా ధ్వజారోహణం, పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ, సంగీతం, బజన కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మునిచంగలరాయుడు, రవి పాల్గొన్నారు.


రెడ్డెమ్మకొండ ఆలయానికి రూ. 50వేల విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి దాతలు రూ. 50,116 విరాళంగా అందజేశారు. రెడ్డెమ్మకొండలో నూతనంగా ఆలయం పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఈసందర్భంగా తిరుపతి పట్టణానికికు చెందిన ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ రెడ్డెప్పరెడ్డి ఆదివారం ఆలయానికి చేరుకొని ఆలయ నిర్మాణానికి తనవంతుగా సాయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డికి అందజేశారు. దాతకు ఆలయ సంప్రదాయం ప్రకారం అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనాలు


సంబేపల్లె: ప్రత్యేక అలంకరణలో శ్రీదేవరరాయి నల్లగంగమ్మ


చిన్నమండెం: సప్పలమ్మ తల్లికి బోనాలు తీసుకెళుతున్న భక్తులు

చిన్నమండెం : మండలంలోని మల్లూరు గ్రామం కొత్తపేట గ్రామంలోని శ్రీ సప్పలమ్మ తల్లికి గ్రామస్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరణలు చేసి, అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వచ్చి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

నల్లగంగమ్మ ఆలయంలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ఇరుగులమ్మకు పూజలు


సిద్దవటం: పూజలందుకున్న ఇరుగులమ్మ

సిద్దవటం : ఇరుగులమ్మకు ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించామని ఆలయ పూజారి వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను చేశారు. కొందరు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. మూలపల్లె గ్రామానికి చెందిన పొట్టేటి ఈశ్వర్‌రెడ్డి దంపతులు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారని పూజారి వెంకటరమణ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గుర్రంకొండ: మండల కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలశాఖ అధ్యక్షులు యూసూఫ్‌సాహెబ్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్ కోసం ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించడంలో సంఘం ముందుంటుందన్నారు. ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పెన్షన్ల చెల్లింపులో జాప్యం చేయరాదని కోరారు. పెన్షనర్లకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి చాంద్‌బేగ్, సంఘం నాయకులు మహబూబ్‌ఆలీఖాన్, రెడ్డెప్పలు తదితరులు పాల్గొన్నారు.